05032024-DIS-04_Layout 1 3/5/2024 2:01 AM Page 1

నమస్తే తెలంగాణ

సహజ సాగు-సందేహాలు

కృత్రిమ ఎరువులు, పురుగుల మందులు వాడకుండా వ్యవసాయం చేయడం మంచిదనే అభిప్రాయం క్రమంగా బలపడుతున్న రోజులివి. రకరకాల పేర్లతో ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులు క్రమంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. అందులో జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్ (జడ్‌బీఎన్ఎఫ్) ముఖ్యమైంది. విఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత పాలేకర్ సుభాష్ పాలేకర్ ఈ విధాన రూపకర్త. 1990లలో ఆయన దీన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు. జీవేతర పదార్థాల వినియోగం అనేది ఏ మాత్రం లేకుండా చేసే వ్యవసాయమే జడ్‌బీఎన్ఎఫ్. ఇందులో జీవేతరం అనేది ఏ మాత్రం లేకపోవడాన్ని బట్టే దీనికి జీరో బడ్జెట్ అనే పేరు వచ్చింది. భూసారం హరించుకుపోవడానికి, కాలుష్యానికి కారణమైన హరిత విప్లవానికి ప్రత్యామ్నాయంగా ఆయన ఈ పద్ధతిని ప్రతిపాదించారు. వానపాముల వంటి సహజ వ్యవసాయ మిత్ర పురుగులు, కీటకాలతోపాటుగా గోమయం, గో మూత్రం వంటివి వాడటం దీని ప్రత్యేకత. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ విధానాన్ని బలంగా సమర్థించడం తెలిసిందే.

ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్‌ప్రదేశ్‌లో ఊపిరి పోసుకున్న ఈ విధానాన్ని ముందుగా కర్ణాటక రాష్ట్రం ప్రయోగాత్మకంగా చేపట్టింది. ఆ రాష్ట్రంలోని వివిధ రకాల వ్యావసాయిక-పర్యావరణ మండలాల్లో దీన్ని ప్రవేశపెట్టారు. తర్వాత కేరళ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలు అనుసరించాయి. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడని కారణంగా వ్యవసాయ బడ్జెట్.. అంటే అదనంగా పెట్టే ఖర్చు తగ్గిపోతుంది. కానీ దాంతో పాటే దిగుబడి కూడా తగ్గిపోవడం ఈ విధానంలో ప్రధాన సమస్య. ఈ కారణంగానే దేశంలోని పలు ప్రాంతాల్లో దీన్ని అమలుచేసిన రైతులు తిరిగి పాత విధానానికే మళ్లారు. దీంతో పాలేకర్ విధానం ప్రభావశీలతపై పలు ప్రశ్నలు ముందుకువచ్చాయి. ఇదే అంశంపై తాజాగా వెలువడిన ఓ అధ్యయన పత్రం సైతం, దేశానికి పూర్తిస్థాయిలో జడ్‌బీఎన్ఎఫ్ లేదా సహజ వ్యవసాయ విధానానికి ఉన్నపళంగా మళ్లడం అంత శ్రేయస్కరం కాదని కేంద్రానికి సూచించడం గమనార్హం. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (నాబార్డ్) భారతీయ అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పరిశోధనా మండలి (ఇక్రీయర్) సంయుక్తంగా ఈ అధ్యయన నివేదికను ప్రచురించాయి. దేశీయ వ్యవసాయంలో జడ్‌బీఎన్ఎఫ్ వంద శాతం అమలుచేస్తే జాతీయ ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని నివేదిక హెచ్చరించింది. ఈ నూతన వ్యవసాయ విధానంపై జరిగిన రెండు ప్రధాన అధ్యయన ఫలితాల మధ్య తీవ్రమైన అంతరం ఉండటాన్ని నివేదిక ఎత్తిచూపింది.

పాలేకర్ సొంత రాష్ట్రమైన మహారాష్ట్రలో పలుచోట్ల జడ్‌బీఎన్ఎఫ్ వ్యవసాయాన్ని చేపట్టిన రైతులు దానిని వదిలేసి పాత పద్ధతులకు మళ్లడం గమనార్హం. ఈ నేపథ్యంలో దీర్ఘకాలికంగా మరింత లోతైన పరిశోధనలు చేపట్టాలని సదరు నివేదిక సిఫారసు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జడ్‌బీఎన్ఎఫ్ విధానం అమలు వల్ల ఖర్చు తగ్గిందనీ, అదే సమయంలో దిగుబడి కూడా పెరిగిందని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సంస్థ తన అధ్యయనంలో తేల్చింది. మరోవైపు భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ జరిపిన అధ్యయనం జడ్‌బీఎన్ఎఫ్ వల్ల ఖర్చు తగ్గినప్పటికీ దిగుబడి మూడోవంతు నుంచి యాభై శాతానికి పైగా తగ్గిందని ఎత్తిచూపింది. దిగుబడి తగ్గితే ధర పెంచాల్సి వస్తుంది. కానీ వ్యవసాయ దిగుబడులకు అధిక ధర అనేది లభించడం కష్టసాధ్యమైన విషయమని చెప్పక తప్పదు. ఒకవేళ లభించినా అది సామాన్య ప్రజలు వాడే ఆహార ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కారణమవుతుంది. ఇక్కడ ఇంకో సమస్య ఏమంటే జడ్‌బీఎన్ఎఫ్ విధానంలో ఉపయోగించే రకరకాల మిశ్రమ ద్రావకాల దీర్ఘకాలిక పర్యావరణ ప్రభావాలేమిటో ఇంకా వెల్లడి కాలేదు. పెద్ద ఎత్తున ఈ తరహా సహజ ఎరువుల తయారీ, సరఫరా సాధ్యాసాధ్యాలపై కూడా ఆలోచించాలి. సహజ వ్యవసాయ విధానం శ్రీలంకలో ప్రతికూల ఫలితాలివ్వడాన్ని ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. జడ్‌బీఎన్ఎఫ్ వ్యవసాయం కారణంగా భారత్ పొరుగునున్న ఆ ద్వీపదేశంలో ఆహార సంక్షోభం ఏర్పడటం తెలిసిందే. ఈ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఒక్కుమ్మడిగా దేశవ్యాప్తంగా సహజ వ్యవసాయ విధానానికి మళ్లేముందు అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించడమే అవశ్యం, అనివార్యం.

ఫలిస్తున్న పాజిటివ్ వైఖరి

సాగునీటి సమస్య అంశాన్ని బీఆర్ఎస్ బలంగా ముందుకు తీసుకురావటం ఒకవైపు గ్రామీణ తెలంగాణ దృష్టిని ఆకర్షిస్తుండగా, మరోకవైపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణ స్థితిలోకి నెడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. కృష్ణా ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగింత, జల వనరుల పథకాలపై శ్వేతపత్రం, మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు అనే మూడు విషయాలను కేంద్రంగా చేసుకొని ఈ మూడు మాసాలలో అసెంబ్లీ లోపల, బయట హోరాహోరీ చర్చలు అనేకం జరిగాయి.

ఇందులో ఎవరి వాదన సరైనదనే ప్రశ్నకు ప్రజల అంతిమ తీర్పు ఎట్లుండగలదో గానీ, ప్రస్తుత పంటలకు ఎటువంటి నీరూ అందక ఎండిపోతూ తల్లడిల్లుతున్న రైతాంగానికి మాత్రం బీఆర్ఎస్ ఈ సమస్యలను గట్టిగా లేవనెత్తటం, అందుకు బదులుగా ప్రభుత్వం తరచు తడబడుతుండటం కళ్లెదుట కనబడుతున్న వాస్తవాలు. ఆ విధంగా, కేవలం ఆరోపణలు, దూషణలనే అధికార పక్షపు నెగెటివ్ వైఖరి వల్ల ఉపయోగం లేకపోతుండగా, రైతులకు ఉపయోగపడేటట్లు మాట్లాడటమనే బీఆర్ఎస్ వైఖరి ప్రజలను మెప్పిస్తున్నది.

టంకశాల అశోక్

రబీ సీజన్ మొదలైన కొద్దికాలం నుంచే రోజూ కనిపిస్తున్న వార్తలేమిటి? ఒక్క మాటలో చెప్పాలంటే కేసీఆర్ పాలన సాగినన్నాళ్లు మొత్తం తెలంగాణలో ఎక్కడ కూడా సాగునీటికి కొరత లేకుండా వ్యవసాయ కార్యకలాపాలు సాగించుకున్న రైతులు ఇప్పుడు ఉన్నట్టుండి నీటి సమస్యను ఎదుర్కోవటం మొదలైంది. గత ప్రభుత్వంలో నీటి ప్రాజెక్టులు, కాలువలు, భూగర్భ జలాలు, చెరువులు, కుంటల నుంచి నిరంతరం నీరు లభించేది. ఖాళీ చెరువులనేవి లేకుండా నింపేవారు. భూగర్భ జలాలు బోర్ల ద్వారా ఎగిసి వచ్చేవి. అందుకోసం అన్ని సంవత్సరాల పాటు కేసీఆర్ వేసిన మంత్రమేమో, ఇప్పుడు కేవలం మూడు నెలలలోనే కొత్త ప్రభుత్వం వేయని మంత్రమేమో గాని, రైతులు పొలాలకు నీళ్లు ట్యాంకర్లతో తెచ్చిపోయవలసి వస్తున్నది. ఎండిన పొలాలను మేత కింద పశువులకు వదలివేస్తున్నారు. పళ్లతోటలు ఎండే ప్రమాదం ముంచుకొస్తున్నది. ఈ స్థితి చాలదన్నట్టు గ్రామాలలో మంచినీటి సమస్య ఇంకా తీవ్రం కాకున్నా వేసవి ఆరంభంలోనే మొదలైంది.

నిజానికి ఈ స్థితిపై చర్చకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను ప్రతిపక్షాలు కోరాలి. అదైతే ఇంకా జరగలేదుగానీ, పంటలకు విపత్కర పరిస్థితి ఏర్పడిన చోట్ల కనీసం లభ్యమైన వనరుల నుంచైనా నీటి విడుదలకు బీఆర్ఎస్ పదే పదే డిమాండ్ చేయటం, అందుకు కొన్ని చోట్ల స్థానిక అధికారపక్ష నాయకత్వం, యంత్రాంగం సహకరించకపోవటం, కొన్నిచోట్ల విడుదల చేయటం కనిపిస్తున్నది. ఇదంతా రైతులు, గ్రామీణుల దృష్టిలో ప్రభుత్వాన్ని బలహీనపరుస్తున్నది. సరిగా ఇటువంటి నేపథ్యంలో పైన పేర్కొన్న మూడు జల సంబంధమైన అంశాలు తెరపైకి వచ్చాయి. సాగునీటి విషయంతో పాటు రైతులు ఇదే మూడు నెలలుగా మరికొన్ని విషయాలపై అనుమానంగా, ఆందోళనగా కనిపిస్తున్నారు. అవి, కాంగ్రెస్ అధికారానికి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న రూ.2 లక్షల రైతు రుణమాఫీని ఒకే విడతలో ప్రకటిస్తూ మొదటి ఫైలుపై సంతకం చేయగలమనటం, రైతుబంధు రూ.15 వేలకు పెంచింపు, రైతు బీమా, కౌలుదార్లకు కూడా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, పంటకు బోనస్ వంటివన్నీ వ్యవసాయరంగానికి సంబంధించినవి కాగా, వీటిపై ప్రభుత్వం ఎంత దాటవేస్తున్నదో ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

ఒకవేళ ఇవి సక్రమంగా జరుగుతుండి ఉంటే పైన పేర్కొన్న ప్రాజెక్టుల అప్పగింత, శ్వేతపత్రం, మేడిగడ్డ అంశాలపై రైతులు తప్పుయినా ఒప్పుయినా ప్రభుత్వంతో ఏకీభవించేవారేమో తెలియదు. కానీ, ఇవన్నీ సరిగా సాగకపోవటం ప్రభుత్వానికి కలిసిరాని విషయమైంది. అంతే ముఖ్యంగా, మరొక స్థాయిలో చూసినప్పుడు, నీళ్ల సంబంధమైన ప్రతి అంశంపై ప్రభుత్వం ఆరోపణలు, అసత్యాల నెగెటివ్ వైఖరితోనే ఈ మూడు మాసాలుగా వ్యవహరిస్తుండటం ప్రజలకు నచ్చటం లేదు. మరోకవైపు బీఆర్ఎస్.. 'మమ్మల్ని ఎంతైనా విమర్శించండి, ఎటువంటి విచారణలైనా జరిపించండి, దోషులపై ఎంతటి చర్యలైనా తీసుకొండి, కాని మాపై ఉన్న కక్షను రైతులపై తీర్చుకోవద్దు, వారి ప్రయోజనాలను కాపాడండి' అని అసెంబ్లీలో, బయటా పదే పదే అంటున్న మాటలను గ్రామీణ ప్రజలు బాగా గుర్తిస్తున్నారు. కాంగ్రెస్ నెగెటివ్ ధోరణికి, బీఆర్ఎస్ పాజిటివ్ తీరుకు ఇది అద్దం పడుతున్నది.

ఈ క్రమంలో గుర్తుపెట్టుకోవలసిన అయిదు ముఖ్యమైన తేదీలు ఫిబ్రవరి 12, 13, 16, 17, మార్చి 1. ఈ తేదీలలో ఏం జరిగింది? కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవటంతో అది మన రైతాంగానికి మరణ శాసనం కాగలదన్న కేసీఆర్ అందుకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 13 నాడు నల్లగొండలో కృష్ణా పరీవాహక ప్రాంతాల రైతుల మహాసభకు పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించటం రొటీన్ నెగెటివిజం అవుతుంది. అట్లాగాక ఆయన పాజిటివ్ దృష్టితో కార్యాచరణ కోసం రైతాంగాన్ని సమీకరించబూనారు. ఆ చర్య పాజిటివ్ ప్రభావం వెంటనే ప్రభుత్వంపై పడింది కూడా. అపుడు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతూ, 12వ తేదీన షెడ్యూల్ ప్రకారం బడ్జెట్‌పై చర్చ జరగవలసి ఉండగా, కేసీఆర్ నల్లగొండ పిలుపు ఒత్తిడితో అసాధారణమైన రీతిలో ప్రభుత్వం బడ్జెట్ చర్చను వాయిదా వేసి మరీ, ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోమంటూ సభలో ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టడం తెలిసిందే. ఇక తీర్మానంపై చర్చలో ఏ విధంగా హరీశ్‌రావు ప్రభుత్వ వాదనలన్నింటినీ తిప్పికొట్టి వారిని నిరుత్తరులను చేశారో లైవ్ ప్రసారాలలో తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రజలు కూడా గమనించారు. అయితే, చర్చ పొడవునా ప్రభుత్వ వైఖరి కేసీఆర్ పాలనను దోషిగా నిలబెట్టేందుకు తప్పుడు లెక్కలు చెప్తూ డాక్యుమెంట్లను వక్రీకరించే నెగెటివ్ ధోరణిలో మాత్రమే సాగగా, హరీశ్ ప్రసంగం యావత్తు యథాతథంగా డాక్యుమెంట్ల ఆధారంతో రైతాంగానికి ఉపయోగపడేవిధంగా పాజిటివ్‌గా సాగినట్టు అందరికీ అర్థమైంది.

అధికార పక్షం అప్పటికైనా పరిస్థితిని గ్రహించకలేక, కేసీఆర్ నల్లగొండ సభ 13న జరుగనుండగా ఆ ముందు రోజున సభను సత్వరమే ముగించి మరీ మేడిగడ్డ యాత్ర తలపెట్టింది. అది అక్కడకు సర్కారు వారి మరో యాత్ర.

> నల్లగొండ నుంచి ప్రజల దృష్టి మరల్చ చూడటం తప్ప అందులో మరో ఉద్దేశం కన్పించదు. తీరా మేడిగడ్డ వెళ్లి కొత్తగా చూపించి, చెప్పింది ఏమీ లేదు. దీనిని ప్రజలు నెగెటివిజం అంటారో, పాజిటివిజం అనుకుంటారో ఎవరి అభిప్రాయానికి వారు రావచ్చు. ఆ తర్వాత నీటి పారుదలపై 16న శ్వేత పత్రమని, ఎందుకో చెప్పకుండా వాయిదా వేసి, 17న ప్రవేశపెట్టారు. విశేషమేమంటే కనీసం ఆ రోజున అయినా కొత్త విషయాలేమీ వెల్లడించక, యథా ప్రకారం పాత విమర్శలే చేసి, 12వ తేదీ నాటి వలెనే హరీశ్‌తో పాటు కడియం శ్రీహరి ఇచ్చిన పకడ్బందీ సమాధానాలతో చిత్తరపోయారు.

ఈ రెండు చర్చల సందర్భంగా ఎన్నో అంశాలతో ప్రభుత్వం తన పత్రాలలో పేర్కొన్నవి, నోటిమాటగా చెప్పినవి కూడా తప్పులని ఆ ప్రసారాలు చూసినవారికి సభావేదికపైననే తెలిసిపోయింది. ఆ విధంగా తెలంగాణ ఏర్పడక ముందు 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నవి గాని, 2014 నుంచి మొన్నటి ఎన్నికల వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేదన్నవి గాని అనేకం అసత్యాలని స్పష్టమైన రీతిలో ఛానల్ ప్రేక్షకులకు అర్థమైపోయింది. దీనంతటిలో ఉన్నది కూడా అధికారపక్షపు నెగెటివిజం, బీఆర్ఎస్ పాజిటివిజం. ఇది చాలదన్నట్టు, అధికారపక్షం వారి నెగెటివిజానికి వారి దూషణలు, పరుషమైన భాష రంగులద్ది ప్రజలను ఒక గంటైనా విరామం లేకుండా ప్రతిరోజూ ఆశ్చర్యపరిచింది.

అసెంబ్లీ బయటి పరిణామాలను గమనిస్తే అక్కడ కూడా రైతాంగానికి ఉపయోగపడగల పాజిటివ్ ధోరణికి బదులు, ఎన్నికలు ముగిసినాక సైతం బీఆర్ఎస్‌పై నిరంతరం కక్ష తీర్చుకునే నెగెటివ్ వైఖరినే ప్రదర్శిస్తూ వస్తున్నారు. బాధ్యత గల ప్రభుత్వం రెండు పనులు చేయాలి. ఒక స్థాయిలో రాజకీయాలు ఎట్లున్నా మరొకస్థాయిలో ఇది రబీ పంటకాలం అయినందున వ్యవసాయదారులకు నీటి సమస్యలు లేకుండా ఎక్కడికక్కడ చర్యలు తీసుకోవాలి. అది ప్రాథమిక బాధ్యత. రెండవ పని కాళేశ్వరం పిల్లర్ల కుంగుదలకు కారణాలేమిటో కాంగ్రెస్ నాయకులు తలో కమాట చెప్పడం గాక నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించాలి. అందులో భాగంగా, పిల్లర్ల మరమ్మతులు జరిగేలోగా ప్రాజెక్టులోని తక్కిన భాగం నుంచి నీటి సరఫరాకు వీలవుతుందా? అయితే ఏ మేరకు? అనే విషయంపై కూడా పరిశీలనలు జరిపించాలి. ఒకవేళ అది అసాధ్యమని నిపుణులు చెప్పినపక్షంలో ఆ ప్రకారం చర్యలు తీసుకోవాలి.

ఇవి రెండూ రైతులకు ఉపయోగపడే పాజిటివ్ కార్యక్రమాలు అవుతాయి. కాని రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు సుదీర్ఘ మాసాలలో రెండూ చేయలేదు. నీటి విషయం పట్టించుకోవటం లేదు. అది అందిన వారికి అందుతున్నది, అందనివారి పంటలు ఎండుతున్నాయి. కాళేశ్వరం విషయానికి వస్తే ఒక వైపు ఆరోపణలు, మరొకవైపు రకరకాల ప్రకటనలతో గందరగోళాలు. ఆరోపణలు సరేసరి. కాని ఆ మూడు పిల్లర్ల వల్ల మొత్తం ప్రాజెక్టే వృథా అయిందని, దానిని పూర్తిగా కూలగొట్టవలసిందేనని, లేదా అట్లా గాలికి వదిలేయాలని, ప్రాజెక్టును తిరిగి తుమ్మిడిహెట్టికి మార్చుతామని, కాళేశ్వరంతో పాటు అన్నారం, సుందిళ్ల కూడా నిరుపయోగంగా మారాయని తలా ఒకటి, రోజుకొక తీరు ప్రకటనలు. బాధ్యులపై విచారణలని, వాళ్ల అరెస్టులని, జైళ్లకు పంపటాలని, వారి నుంచి డబ్బు వసూళ్లని మరొకరకం హెచ్చరికల పరంపరలు. కాని విజిలెన్స్ విచారణ జరిపించినా ఆ నివేదికలో ఏముందో అధికారికంగా తెలియదు. జడ్జితో విచారణ అన్న జాడ ఏమిందో తెలియదు. రాష్ట్ర పరిశీలనలో ఏమి వెల్లడైందో వివరాలు తెలియవు. కేంద్రస్థాయి ఎన్ఎస్‌డీఏ ప్రాథమిక నివేదిక హడావుడిగా రెండురోజులలో వచ్చిన తర్వాత ముందుకు కదలలేదు. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ నివేదిక రహస్యంగానే ఉంది. ఇప్పుడు తాజా పరిణామం ఎన్ఎన్‌డీఏ చంద్రశేఖర్ అయ్యర్ బృందాన్ని నియమించటం. అది నాలుగు మాసాలలో నివేదిక ఇస్తుందట. పిల్లర్ల కుంగుబాటుకు కారణాలను నిర్ధారించటంతో పాటు మరమ్మతులను సూచిస్తుందని చెప్తున్నారు. ఆ బృందం కాళేశ్వరం వద్ద కుంగిన పిల్లర్ల ప్రాంతాన్ని పదిలి తక్కిన చోటినుంచి నీరు వదలవచ్చునని హరీశ్‌రావు అంటున్న మాటను పరిగణనలోకి తీసుకొని పరిశీలన చేయగలదో లేదో తెలియదు. అది ఆ బృందానికి వదిలివేద్దాం.

నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ కేంద్ర కమిటీ పరిశీలన మాట ప్రామాణికం అని ఇప్పుడు ప్రకటిస్తున్నారు. ఆ నివేదిక మేరకు మరమ్మతులు చేయగలమంటున్నారు. ఇదంతా ఎప్పటినుంచి వచ్చిన మార్పు? బీఆర్ఎస్ బృందం మార్చి 1న కాళేశ్వరానికి వెళ్లి, తమ వాదనలు ఏమిటో రైతాంగానికి, ప్రజలకు వివరించి చెప్పిన తర్వాత వచ్చిన మార్పు. ఫిబ్రవరి ఆఖరు వరకు మహా దూకుడుగా కనిపించిన వారు ఇప్పుడు నిర్మాణాత్మక మార్గంలోకి మళ్లినట్టు కనిపిస్తున్నది. వాస్తవానికి అసెంబ్లీలో తమ వాదనలు పమ్మయినప్పుడే వారి ధోరణి మారవలసింది. కనీసం ఇప్పుడైనా పాజిటివ్ ధోరణికి కట్టుబడగలరని ఆశించాలి.

> ఈ మూడు మాసాల పాటు అన్నీ గమనించిన రైతులు, సాధారణ ప్రజలు ఇప్పుడు ఎండుతున్న పొలాల మధ్య నిల్చొని ఆ వ్యథను అనుభవిస్తూ, రాజకీయాలు ఎట్లున్నా తమ జీవితాలకు సంబంధించి ఎవరు నెగెటివ్, ఎవరు పాజిటివ్ అన్నది స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. ప్రభుత్వం మారిన కొద్ది మాసాలకే, తొలి వేసవిలోనే, తొలి పంట కాలంలోనే వారికి ఇటువంటి అనుభవం ఎదురు కావటం మరిచిపోలేనిది.

పాక్‌కు రావి జలాల నిలిపివేత పీవీ చలవే

1960లో పాకిస్థాన్‌తో ఒప్పందం జరిగినప్పటికీ రావి నదిపై ఆనకట్టను నిర్మించడంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా పాక్‌కు అప్పనంగా నదీ జలాలు అందడంపై స్పందించిన పీవీ నరసింహారావు అప్పటి ప్రధానిహోదాలో 1995లో కండి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అయితే మూడేండ్లలోనే పూర్తి కావలసిన ప్రాజెక్టు.. రాష్ట్రాల మధ్య వివాదాలు, తర్వాతి పాలకుల చిత్తశుద్ధి లేమి కారణంగా మరో 25 ఏండ్లు ఆలస్యంగా ఇటీవల పూర్తయింది. దాంతో పాకిస్థాన్‌కు రావి నీటి సరఫరాను ఆపి భారత్‌లో వినియోగించుకునే అవకాశం మనకు దక్కింది. ఈ ప్రాజెక్టుకు అద్యుడు మన పీవీ కావడం మనకు గర్వకారణం.

స్వామి ఆర్వీవీయస్

సింధు నదీ వ్యవస్థలోని మూడు తూర్పు నదులలో రావి ఒకటి.1960లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదుల పంపకంపై ఒప్పందం జరిగింది.దాని ప్రకారం సింధు వ్యవస్థలోని పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్‌ల నీరు పాకిస్థాన్ వాటాలోకి వస్తుంది. రావి, బియాస్, సట్లెజ్ అనే మూడు తూర్పు నదుల నీటిని భారత్ ఉపయోగించుకోనుంది.

ఈ ఒప్పందం ప్రకారం, పాకిస్థాన్ మూడు పశ్చిమ నదుల నుంచి 135 మిలియన్ ఎకరాల అడుగులు (ఎంఎఎఫ్) పొందుతుంది. రావి నదిపై రంజిత్ సాగర్ ఆనకట్టకు 11 కిలోమీటర్ల దిగువన, మాధోపూర్ బ్యారేజీకి 8 కిలోమీటర్ల ఎగువన ఉన్న షాపూర్ కండి ఆనకట్ట రావి జలాలను బాగా ఉపయోగించుకోవడానికి భారతదేశానికి సహాయపడుతుంది.

ఒప్పందం జరిగినప్పటికీ కేంద్రం సమగ్రమైన యోచన చేయకపోవడంతో రావి నది పాకిస్థాన్‌లోకి ప్రవహిస్తుండటంతో భారత్ 24 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించుకోలేకపోయింది. 35 ఏండ్లుగా భారత్‌కు జరిగిన నష్టాన్ని గ్రహించిన అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు, 1995 ఏప్రిల్ 20న షాపూర్‌కండి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి మూడేండ్లలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

అయితే, తర్వాత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం సాధించలేకపోవడంతో ఆయన ప్రధాని పదవి నుంచి వైదొలిగారు. తర్వాత పంజాబ్, హర్యానా, జమ్మూకశ్మీర్‌ల మధ్య ఏర్పడ్డ వివాదాల కారణంగా ప్రాజెక్టు పురోగతి సాధించలేకపోయింది. అటు పిమ్మట వచ్చిన ప్రభుత్వాలేవీ కూడా ఈ ప్రాజెక్టుపై అంతగా శ్రద్ధ చూపలేదన్నది కూడా ఒక కారణం. నవంబర్ 2001లో ఆనకట్ట పనులకు ప్రణాళికా సంఘం ఆమోదం తెలిపినప్పటికీ పంజాబ్ నిధుల కొరతను ఎదుర్కొంటున్నందున పనులు పెద్దగా పురోగతి సాధించలేకపోయాయి.

> గత 24 ఏండ్లలో ఈ ప్రాజెక్టుకు అనేక శంకుస్థాపనలు జరిగాయి. పనులు వేగవంతం చేస్తామని 2001 ఏప్రిల్ 4న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి హామీ ఇచ్చారు. పఠాన్‌కోట్ సమీపంలోని రంజిత్ సాగర్ డ్యాం ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన సందర్భంగా వాజపేయి ఈ ప్రకటన చేశారు.ఇద్దరు ప్రధానులు, ముఖ్యమంత్రులు, పంజాబ్ క్యాబినెట్ మంత్రులతో సహా రాజకీయ నాయకులు శంకుస్థాపనలు చేసినప్పటికీ, ప్రాజెక్టు పురోగతి నత్తనడకనే సాగింది.

రావి, బియాస్ జలాలకు సంబంధించి 1981 డిసెంబర్ 31న పంజాబ్, హర్యానా, రాజస్థాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేస్తూ 2004 జూలై 12న పంజాబ్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా రూపొందించిన ఈ బిల్లులోని పంజాబ్ నదీజలాల హక్కులను కాంగ్రెస్, అకాలీలు ఏకపక్షంగా సమర్థించారు.ఈ బిల్లు నీటి పంపకాల సమీకరణాన్ని మొత్తం మార్చేసింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) ప్రకారం రాష్ట్రపతి తన అధికారాలను ఉపయోగించి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జమ్మూకశ్మీర్‌ను పార్టీగా చేర్చి నోటీసులు జారీ చేయడంతో ఈ బిల్లును వ్యతిరేకిస్తూ 2004 నవంబర్ 20న సుప్రీంకోర్టులో సమాధానం దాఖలు చేసింది.1966 పంజాబ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 78, 79లను భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ పంజాబ్ ప్రభుత్వం 2007లో సుప్రీంకోర్టులో సివిల్ దావా వేసింది. ఇలా వివాదం కోర్టు పరిధిలోకి చేరడంతో ప్రాజెక్టు మూలన పడింది.

చివరికి 2018 సెప్టెంబర్ 8న న్యూఢిల్లీలో ఎంవోడబ్ల్యూఆర్, ఆర్డీ అండ్ జీఆర్ ఆధ్వర్యంలో పంజాబ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది.దాంతో 2018 డిసెంబర్ 6న కేంద్ర మంత్రివర్గం రావి నదిపై పంజాబ్‌లోని షాపూర్ కండి ప్రాజెక్టు అమలుకు ఆమోదం తెలిపింది. తొలుత 1995లో శంకుస్థాపన చేసే నాటికి రూ.286 కోట్ల అంచనాలతో ఉన్న ప్రాజెక్టు వ్యయం తరువాత 31.10.2018న జరిగిన 138వ ఎంవోడబ్ల్యూఆర్, ఆర్డీ అండ్ జీఆర్ సలహా కమిటీ సమావేశంలో రూ.2715.70 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం రూ.3,300 కోట్లకు ఎగబాకింది. కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది.

షాపూర్ కండి మల్టీపర్పస్ రివర్ వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా 55.5 మీటర్ల ఎత్తైన ఆనకట్టను నిర్మించారు.ఇందులో 206 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో రెండు జలవిద్యుత్ కేంద్రాలు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల మాధోపూర్ బ్యారేజీ ద్వారా పాకిస్థాన్‌కు వృథాగా పోతున్న రావి నీటిని అడ్డుకోవచ్చు.అయితే, ఈ ప్రాజెక్టు పూర్తి ప్రయోజనం విద్యుత్ ప్లాంట్లు పూర్తయ్యాకే సాకారం అవుతుంది. ఈ రెండు జలవిద్యుత్ కేంద్రాలు 2025 చివరి నాటికి పూర్తవుతాయని భావిస్తున్నారు.

ఏప్రిల్ నెలాఖరు లేదా మే మొదటి వారంలో డ్యాంలో నీటి నిల్వను అధికారులు ప్రారంభిస్తారు. దీని ద్వారా పంజాబ్‌లో 5 వేల హెక్టార్లు, జమ్మూకశ్మీర్‌లో 32 వేల హెక్టార్లకు సాగునీరు అందుతుందని అధికారులు తెలిపారు.షాపూర్ కండి ఆనకట్ట అందుబాటులోకి రావడంతో పాకిస్థాన్‌కు నీరు వెళ్లకుండా రంజిత్‌సాగర్ డ్యాంను పూర్తి సామర్థ్యంతో నడపగలుగుతామని, షాపూర్ కండి దిగువకు నియంత్రిత నీటి విడుదల ఉంటుందని, ఇది మాధోపూర్ బ్యారేజీ వద్ద నీటిని సద్వినియోగానికి వీలు కల్పిస్తుందని వివరించారు. ఇదంతా ఎంతో ముందుచూపుతో వ్యవహరించిన మన తెలంగాణ బిడ్డ పీవీ ఘనతే.

వాగ్భూషణం-భూషణం

**నేటి సమాజ కల్లోల పరిస్థితికి ప్రధాన కారణం.. వాగ్భూషణం వాచాలతగా మారడమే. సౌమ్యంగా మాట్లాడితే అనేక సమస్యలు సులభ పరిష్కారాలకు నోచుకునేవి. సమాజంలో ఒక స్థాయి కలిగి ఉండే కొందరు వ్యక్తులకే అవకాశం దొరికే సంభాషణం, చర్చల్లో పాల్గొనడం నేడు సాంఘ